క్లుప్తంగా

నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న లీడ్ బ్యాంకు మేనేజర్ రమణ

నరసాపురం రూరల్: రుణాల మంజూరు, వసూళ్లలో నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా చేరుకోవాలని లీడ్ బ్యాంకు మేనేజర్ రమణ బ్యాంకర్లకు సూచించారు. బుధవారం నరసాపురం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన బ్యాంకర్లు, ఇతర శాఖల సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా ప్రభుత్వం రైతు రుణాలను రీషెడ్యూల్ చేసిందన్నారు. ఇందుకు తగ్గ విధివిధానాలను బ్యాంకర్లకు వివరించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ మంగపతిరావు, డీపీఎంలు కొండవేటి శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పేద రోగులకు మందుల వితరణ


మందులు అందజేస్తున్న వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు

పాలకొల్లు అర్బన్: పేద రోగులను ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు, మానవతావాదులు ముందుకు రావాలని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు అన్నారు. పాలకోడేరు మండలం మోగల్లుకు చెందిన ఈడేపల్లి తల్లి అనే వృద్ధురాలు ఫిట్స్ వ్యాధితో బాధపడుతూ మందులు కొనుగోలు చేసుకోవడానికి ఇబ్బంది పడుతోంది. ఈ విషయాన్ని వాకర్స్ క్లబ్ దృష్టికి తీసుకురావడంతో క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు స్పందించి రూ.10 వేల విలువైన మందులను బుధవారం ప్రియాంక టవర్స్ వద్ద రోగికి అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమాశంకరరావు, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, జవ్వాజి కల్యాణ్, బోనం రాజు, తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో అభివృద్ధికి శ్రీకారం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పితాని

పెనుగొండ: పల్లెల్లో అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. బుధవారం పల్లె పండుగలో భాగంగా చినమల్లంలో రూ.52 లక్షలతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు శంకు స్థాపన చేశారు. కార్యక్రమంలో ఆచంట జెడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్ బాబు, చినమల్లం సర్పంచ్ చిట్టూరి సుబ్రహ్మణ్యం, ఉప సర్పంచ్ మానుకొండ వెంకటేష్, ఎంపీటీసీ బొక్కా ఏడుకొండలు, కొండవీటి శ్రీనివాసరావు, వెలిచేటి బాబూరాజేంద్ర ప్రసాద్, గుత్తుల లోకేశ్వరరావు, కేతా మీరయ్య, ఎంపీడీవో పాల్గొన్నారు.

కన్నుల పండువగా వెంకన్న కల్యాణం


కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కాళ్ల: గోవింద నామస్మరణతో కాళ్లకూరు మార్మోగింది. కాళ్ల మండలం కాళ్లకూరులో వేంచేసియున్న స్వయంభు శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆశ్వయుజమాస లఘు (చిన్న) కల్యాణ మహోత్సవం బుధవారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీమాన్ అరంగంటి ఝాన్సీలక్ష్మి కుమారులచే ఆలయ అర్చకులచే వేద పండితులు అనిపెద్ది ఫణికుమార్ శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రాల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవ కార్యక్రమానికి జిల్లా నలు మూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ నిర్వహించారు. పెళ్లిళ్ల సీజన్ కావటంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను దేవస్థానం కార్య నిర్వహణ అధికారి ఎం.అరుణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేటి నుంచి ఉపవాస కూడికలు

పాలకోడేరు: మోగల్లు సెయింట్ పాల్ లూథరన్ చర్చి వద్ద గురువారం నుంచి శుక్రవారం వరకు ఆశీర్వాద ఉపవాస కూడికలు నిర్వహించనున్నట్లు సంఘ కాపరి గోపే సాల్మన్‌రాజు తెలిపారు. కూడికలు ప్యారిస్ పాస్టర్ రెవరెండ్ వై.జయరాజ్ ప్రారంభిస్తారని ప్యారిస్ పరిధిలో సంఘాలు జయప్రదం చేయాలని కోరారు.

ప్రజలకు మరుగేదీ.. ?

- పబ్లిక్ టాయిలెట్స్ లేక జనం ఇబ్బందులు
- పట్టించుకోని పురపాలకులు

నరసాపురం: పట్టణంలో మార్కెట్ ప్రాంతానికి వచ్చిన జనానికి కనీసం మరుగు కూడా లేని పరిస్థితి. అవసరమైన ప్రాంతాల్లో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలన్న ఆలోచన పుర పాలకులు కానీ, మున్సిపల్ అధికారులు కానీ చేయకపోవడం గమనార్హం. బజార్‌లో మరుగులేక జనం ఇబ్బందులు పడుతున్నారు. మహిళల పరిస్థితి అయితే మరీ ఇబ్బంది కరంగా ఉంది. నరసాపురం పట్టణం 31 వార్డులతో విస్తరించి ఉంది. పట్టణాన్ని ఆనుకొని చుట్టు పక్కల 50 పంచాయతీలు ఉన్నాయి. చుట్టుపక్కల గ్రామాల వారు అందరూ తెల్లారితే ముఖ్యమైన పనులపై, సరుకులు కొనడానికి పట్టణానికి చేరుకుంటారు. కానీ పట్టణంలో బస్టాండ్ నుంచి ప్రధాన మార్కెట్ పొడువునా శివాలయం సెంటర్ వరకూ, ఇటు మొగల్తూరు రోడ్‌లో మేదర్ల వంతెన నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకూ ఎక్కడా పబ్లిక్ టాయిలెట్స్ లేవు. దీంతో రోడ్డు పక్కనే జనం ఆ అవసరం తీర్చుకుంటున్నారు. మహిళలకయితే ఆ వెసులుబాటు కూడా లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు.



పట్టణంలోని ఆంధ్రా బ్యాంకు రోడ్డులో నిరుపయోగంగా ఉన్న ఓఎన్జీసీ సంస్థ నిర్మించిన టాయిలెట్స్

అమలు కాని హామీలు

గతంలో మున్సిపాలిటీ శివాలయం సెంటర్‌లోనూ, ఫిష్ మార్కెట్ వద్ద పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలని నిర్ణయించింది. అయితే పెద్దగా దృష్టి పెట్టలేదు. దీంతో పని జరగలేదు. 2015 పుష్కరాల సమయంలో కూడా కోట్లాది రూపాయలతో పనులు చేశారు. కానీ ప్రజల శాశ్వత అవసరాలను దృష్టిలో పెట్టుకొని పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలనే ఆలోచన అప్పటి టీడీపీ పాలకులు చేయలేదు. మార్కెట్ ప్రాంతంలో టాయిలెట్స్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. పట్టణంలో వివిధ షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో కూడా మరుగుదొడ్లు లేవు. షాపుల్లో పని చేసే మహిళలు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఆంధ్రా బ్యాంకు రోడ్డులో ఏడేళ్ల క్రితం ఓఎన్జీసీ సంస్థ టాయ్‌లెట్స్ నిర్మించి ఇచ్చింది. వాటినీ మున్సిపాలిటీ నిరుపయోగంగా మిగిల్చింది.

పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేయాలి


ఎంపీడీవో పేమాన్వితకు అభినందనలు చెబుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

యలమంచిలి: ఇటీవల యలమంచిలి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన నందిపాటి ప్రేమాన్వితను బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. ఎంపీడీవోను కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇనుకొండ రవి, మాజీ ఎంపీపీ రావూరి వెంకటరమణ, వైస్ ఎంపీపీలు గొల్లపల్లి శ్రీనివాసరావు, కొప్పాడి శ్రీనుబాబు, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు కవురు గోపి, ఎంపీటీసీలు ఇనుకొండ ధనలక్ష్మి, కంబాల సత్యశ్రీ, సర్పంచ్‌లు వల్లభు సాయి వెంకట నరసింహరావు, కామిశెట్టి సాయిబాబా, మేడిది విజయ జ్ఞానమణి, గటిగండి మహేష్, తదితరులు ఉన్నారు.

పశుపోషణలో ఆరోగ్య సంరక్షణ ముఖ్యం


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

మొగల్తూరు: పశుపోషణలో ఆరోగ్య సంరక్షణ చాలా ముఖ్యమని వెటర్నరీ డాక్టర్ జి.నీలిమ తెలిపారు. బుధవారం మండలంలోని కాళీపట్నం తూర్పు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మొగల్తూరు పశు వైద్యశాఖ డాక్టర్ నీలిమ మాట్లాడుతూ పశువుల ఆరోగ్య విషయంలో అశ్రద్ధ వహిస్తే పశువుల ఉత్పత్తి తగ్గిపోవడంతో పాటు పాల దిగుబడి కూడా తగ్గిపోతుందన్నారు. పశువుల యజమానులకు కావలసిన సలహాలు, సూచనలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ సర్పంచ్ మేడిది సౌజన్య, ఎంపీటీసీ సభ్యురాలు తణుకుల శ్రీ వెంకట దుర్గ, వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్, మత్స్యశాఖాధికారి వివేక్, నాయకులు మేడిది ప్రభాకర్, తణుకుల వాసు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజకిశోర్

మొగల్తూరు: ప్రజల సమస్యలు ఏ శాఖకు వచ్చినా సంబంధిత అధికారితో పాటు అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకొని సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ కె.రాజకిశోర్ సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం మండలంలోని అన్ని శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేరకు ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలను పరిష్కరించే విషయంలో అధికారులను సమన్వయం చేసుకోవాలన్నారు. సమస్య ఏదైనా ఫిర్యాదుదారుడు, ప్రత్యర్థులను విచారించి, సమస్య మరోసారి తలెత్తకుండా పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి, ఎస్సై జి.వాసు, ఇరిగేషన్ ఏఈ హరికృష్ణ, పీఆర్ ఏఈ వెంకటేశ్వరరావు, ఏవో అబ్దుల్ రహీమ్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యాభ్యాసం వినూత్నంగా కొనసాగించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న రీజనల్ జాయింట్ డైరెక్టర్ నాగమణి

పాలకొల్లు అర్బన్: కొత్త ఆలోచనలతో నూతన కృత్యాలను ఆవిష్కరించే దిశగా విద్యార్థులు తమ విద్యాభ్యాసాన్ని కొనసాగించాలని రీజనల్ జాయింట్ డైరెక్టర్(కాకినాడ), పశ్చిమ గోదావరి జిల్లా విద్యాశాఖాధికారి జి నాగమణి చెప్పారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు జెడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం నాగమణి ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల అటల్ ల్యాబ్‌ను సందర్శించారు. విద్యార్థులు రూపొందించిన రోబోటిక్, చంద్రయాన్ నమూనాలను ఆమె పరిశీలించారు. విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచిన పాఠశాల విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో ఆమె మాట్లాడారు. పదో తరగతిలో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించడానికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థుల ప్రగతిని ఆమె సమీక్షించారు. ఉపాధ్యాయ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పోటీ పరీక్షలకు అనుగుణంగా విద్యాబోధన చేయాలని సూచించారు. పదో తరగతిలో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులను కోరారు. ఆమె వెంట ఎంఈవోలు గుమ్మళ్ల వీరాస్వామి, ఆర్ఎస్‌వీఎస్ గంగాధరశర్మ, హెచ్ఎం పి భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, ఎంఈవో కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

ఆదమరిస్తే.. గోతిలోనే !


బస్టాండ్ వద్ద మూతలు లేకుండా ప్రమాదకరంగా ఉన్న డ్రెయిన్

నరసాపురం: స్థానిక బస్టాండ్ వద్ద డ్రెయిన్ ప్రమాదకరంగా ఉంది. డ్రెయిన్‌పై మూతలు లేవు. నిత్యం వేలాది మంది ఈ మార్గం గుండా ప్రయాణిస్తారు. అలాంటి ఈ మార్గంలో పరిస్థితి ఇంత ప్రమాదకరంగా ఉన్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఇటీవల బస్టాండ్ పక్కనున్న డ్రెయిన్‌ను బాగు చేసి, మూతలు తీశారు. పని పూర్తయిన తరువాత, తిరిగి మూతలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయలేదు. డ్రెయిన్స్‌పై మూతలు లేకపోవడంతో అనేక మంది, గోతుల్లో పడి కాళ్లు, చేతులు విరగొట్టుకుంటున్నారు. అసలే ఈ డ్రెయిన్ పూర్తిగా శిథిలమై ఉంది. ప్రస్తుతం రెండు రోజుల నుంచి వర్షాలు పడుతుండటంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నేడు పల్లె పండుగ ప్రారంభం

మొగల్తూరు: పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలను గురవారం మండలంలోని రెండు గ్రామాల్లో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో త్రిశూలపాణి బుదవారం తెలిపారు. కొత్తోట, రామన్నపాలెం గ్రామాల్లో నిర్వహంచే కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారన్నారు.

నేటి నుంచి మంచినీటి సరఫరా

నరసాపురం : పట్టణంలోని మున్సిపల్ రక్షిత మంచినీటి పథకం కార్యాలయంలో చేపట్టిన మరమ్మతులు ముగిశాయని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య చెప్పారు. గురువారం ఉదయం నుంచి యధావిధిగా రెండుపూటలా మంచినీటి సరఫరా చేస్తామన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

నేడు హుండీల లెక్కింపు

కాళ్ల: కాళ్లకూరులో వేంచేసియున్న స్వయంభు శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం ఉదయం స్వామి వారి హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహిస్తున్నామని దేవస్థానం ఈవో ఎం.అరుణ్‌కుమార్ బుధవారం తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ భీమవరం తనిఖీదారు, గ్రామస్తులు, భక్తుల సమక్షంలో స్వామి వారి హుండీలు తెరిచి లెక్కిస్తామని ఆయన స్పష్టం చేశారు.

రేపటి నుంచి రీ సర్వే గ్రామ సభలు

పెనుగొండ: ఆచంట మండలంలో ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకూ గ్రామ స్థాయిలో భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి రీ సర్వే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఆచంట తహసీల్దార్ ఎం.సోమేశ్వరరావు తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 18న పెనుమంచిలి, 22న కరుగోరుమిల్లి, 24న కందరవల్లి, 26న కొడమంచిలిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహిస్తామని వివరించారు. గ్రామ సచివాలయంలో సదస్సులు నిర్వహిస్తామన్నారు. తహసీల్దారు, ఉప తహసీల్దారు (రీ సర్వే), ఆర్ఐ, మండల సర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ సర్వేయర్లు టీంగా సదస్సులో పాల్గొంటారన్నారు.

వైభవంగా అమ్మవారి ఊరేగింపు


ఊరేగింపులో ఆకట్టుకున్న వేషధారణలు


కొప్పర్రులో ఊరేగుతున్న దుర్గమ్మ

నరసాపురం రూరల్: మండలంలోని కొప్పర్రు గ్రామంలో దేవీ నవరాత్రుల ముగింపు వేడుకను పురస్కరించుకొని బుధవారం నిమజ్జన ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీ దేవీ నవరాత్రుల వేడుకల ముగింపు ఉత్సవాలను పురస్కరించుకొని గ్రామంలోని ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించి నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విచిత్ర వేషధారణలు, బుట్ట బొమ్మలు, నృత్యాలు, ఆసాదుల నృత్యాలతో యువత కేరింతలతో సందడి వాతావరణం నెలకొంది. గ్రామస్తులంతా కలిసి అట్టహాసంగా అమ్మవారిని ఊరేగించారు.

ముగిసిన తపాలా వారోత్సవాలు


ఉత్తమ సేవ సత్కారాలు అందుకున్న తపాల శాఖ సిబ్బంది

భీమవరం (ప్రకాశం చౌక్): పోస్టుమెన్ సేవలు అద్వితీయమని, తపాల శాఖలో పోస్టుమెన్ పాత్ర కీలకమని మున్సిపల్ కమిషనర్ కె రామచంద్ర రెడ్డి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, తపాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారత తపాల శాఖ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పోస్టుమెన్‌లు, అధికారుల్లో ఉత్తమ సేవలు అందించేవారిని సత్కరించడం అభినందనీయమన్నారు. సత్కారాలు అందుకున్న వారు ఉద్యోగులకు స్ఫూర్తిగా నిలుస్తారన్నారు. ఉత్తమ సేవలు అందించిన నాలుగురు ఉద్యోగులను 12 మంది ఉత్తమ పోస్ట్ మెన్లను తపాల శాఖ ప్రధాన కార్యాలయంలో సత్క రించారు. తపాల వారోత్సవాల్లో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన 31 మంది విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

నిత్యావసరాల ధరలను నియంత్రించాలి

భీమవరం: సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సమావేశం భీమవరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రభుత్వం రంగంలోనే నడుపుతామని కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలన్నారు. దీనిపై నిర్ణయం చెప్పకుండా తాత్సారం చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు, కూరగాలు, వంటనూనె, వంటగ్యాస్, ఇందన ధరలు విపరీతంగా పెరిగాయని, ప్రభుత్వం వెంటనే ధరల నియంత్రణ చేపట్టాలన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలపై, నిత్యావసర వస్తువుల ధరలపై దృష్టి పెట్టాలని కోరారు. భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. ఉచిత ఇసుక హామీని నెరవేర్చి కుదేలైన నిర్మాణ రంగాన్ని కాపాడాలని దానిపై ఆధారపడిన వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

రహదారులు ఇలా.. ప్రయాణం ఎలా?


కాళ్లకూరు వద్ద అధ్వానంగా ఉన్న రహదారి


కాళ్ల పోలీస్ స్టేషన్ సమీపంలో వర్షపు నీటితో నిండిపోయిన రహదారి

కాళ్ల: జువ్వలపాలెం రాష్ట్రీయ రహదారి అధ్వానంగా మారింది. అడుగడుగునా భారీ గోతులతో ప్రమాదకరంగా తయారయింది. కాళ్ల మండలంలో రాష్ట్రీయ రహదారి పరిధిలో పెదఅమిరం నుంచి ఏలూరుపాడు వరకు రహదారి మొత్తం ఛిద్రంగా మారింది. ఆ రహదారి ప్రయాణం అంటేనే ప్రయాణికులు భయపడే పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వ హయాంలో మరమ్మతులు చేసినప్పటికీ ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు రాష్ట్రీయ రహదారి మరింత అధ్వానంగా తయారైంది. రోడ్లపై ఉన్న భారీ గోతుల్లో వర్షపు నీరు నిలబడటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు గోతుల్లో పడి ప్రమాదాలు సంభవించిన సంఘటనలు లేకపోలేదు. ప్రధానంగా రాష్ట్రీయ రహదారిని ఆనుకొని మండలంలో పెద అమిరం, కోపల్లె, జక్కరం, సీసలి, కాళ్ల, దొడ్డనపూడి, కాళ్లకూరు, జువ్వలపాలెం, ఏలూరుపాడు గ్రామాల పరిధిలో రహదారి మరింత అధ్వానంగా ఉంది. కనీసం అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయంలో గోతుల్లో వర్షపు నీరు నిలబడటంతో ఎటువైపు ప్రయాణించాలో తెలియక ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా కాళ్లకూరు వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో, మండల కేంద్రమైన కాళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో, దొడ్డనపూడి గ్రామం వద్ద భారీ గోతులు ఏర్పడ్డాయి. కొద్దిపాటి వర్షానికి మీ భారీ గోతుల్లో వర్షపు నీరు నిలవడంతో రహదారి కాలువను తలపిస్తుంది. ఏలూరుపాడు నుంచి భీమవరం వెళ్లాలంటే అరగంటలో వెళ్లే ప్రయాణం ఇప్పుడు గంటల సేపు ప్రయాణించాల్సి వస్తుంది ప్రయాణికులు వాహనదారులు వాపోతున్నారు. ఈ గోతుల్లో పడి వాహనాలు కూడా దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు సంభవించకుండా తాత్కాలిక మరమ్మతులైనా చేయాలని కోరుతున్నారు.

అంతర్గత రహదారులూ ఇదే పరిస్థితి

మండలంలో రాష్ట్రీయ రహదారితో పాటు పలు గ్రామాల్లో ఉన్న అంతర్గత ఆర్అండ్‌బీ రహదారులు సైతం భారీ గోతులతో అధ్వానంగా ఉండటంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. వేంపాడు ఆర్అండ్‌బీ రహదారి, కాళ్ల నుంచి కోలనపల్లి వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి, కలవపూడి శివారు మోడీ, పల్లెపాలెం నుంచి ఎస్సీ బోస్ కాలనీలకు వెళ్లే ఆర్అండ్‌బీ రహదారులు గోతులమయమై ప్రయాణానికి తీవ్ర ఆటంకంగా ఉన్నాయి.